నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

# కామారెడ్డి

గురువారం 30 నవంబర్ 2023
THURSDAY, NOVEMBER 30, 2023
KAMAREDDY

## ఓటేద్దాం.. చైతన్యాన్ని చాటుదాం..




**రాజ్యాంగం** కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని చైతన్యాన్ని చాటాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక్క ఓటుతో పోయేదిమీ లేదని నిర్లక్ష్యాన్ని వీడి ప్రతి ఓటూ కీలకమే అన్న భావనతో మననుపాలించే నేతను ఎన్నుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.




| | |
|---|---|
| పురుషులు | 4,19,226 |
| మహిళలు | 4,46,523 |
| ఇతరులు | 45 |

మొత్తం ఓటర్లు **8,65,794**

ఎన్నికల సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది సందడి

# సర్వం సిద్ధం..

## నేడు పోలింగ్

- కేంద్రాలకు తరలిన 3800 మంది ఎన్నికల సిబ్బంది
- ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం
- నాలుగు నియోజకవర్గాల్లో 913 బూత్‌లు
- మొత్తం 8,65,794 మంది ఓటర్లు
- దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పోలింగ్ సామగ్రి పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

**జిల్లాలో శాసనసభ** ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డి, మద్నూర్, బాన్సువాడలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేశారు. కేంద్రాలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పర్యవేక్షించారు. పోలింగ్ గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఓటరు స్లిప్పులు లేని వారు ఎన్నికల కమిషన్ సూచించిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక దానిని తీసుకెళ్లి ఓటు వేయవచ్చు. ఒక రోజు ముందుగానే సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో 8,65,794 మంది ఓటర్లు ఉండగా 913 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

లోపలి పేజీల్లో

## ముందస్తు నాట్లు..

**ఉమ్మడి** జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ముందస్తు వరినాట్లు వేయడం ద్వారా పంట నష్టం జరిగే అవకాశాలు ఉండవని, పంట దిగుబడి సైతం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం సైతం ముందస్తు వరినాట్లను ప్రోత్సహిస్తున్నది. చందూర్ మండల కేంద్రంలోని ఓ రైతు బుధవారం వరినాట్లు ప్రారంభించారు.

చందూర్, నవంబర్ 29



# నోట్ల కట్టలు కాంగ్రెస్‌వే..

- ఎన్నికల్లో డబ్బునే నమ్ముకున్న కాంగ్రెస్
- హస్తం నాయకుల వద్ద రూ.56 లక్షలు స్వాధీనం
- రేవంత్ ప్రధాన అనుచరుడిపై కేసుతో తేటతెల్లం
- డబ్బులు పంచుతూ దొరికిన మరో కాంగ్రెస్ నేత
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతున్న జనం

-4లో..



**ప్రజల మనసును** గెలుచుకోలేమని తేలిపోవడంతో హస్తం నేతలు ప్రలోభాలకు తెరలేపారు. డబ్బుతో నాయకులు, ప్రజలను మభ్యపెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి అనుచరుడి వద్ద లక్షలాది రూపాయల నగదు దొరకడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. పోటీకి దిగిన నాటి నుంచి రేవంత్‌రెడ్డికి గడ్డు పరిస్థితులు దాపురించడంతో దొడ్డిదారిని ఎంచుకున్నాడు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో హస్తం నేతల తీరుపై సామాన్య జనం సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-నిజామాబాద్, నవంబర్ 29, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)